
సాక్షి ఒడిశా
బుధవారం, 8, ఫిబ్రవరి, 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.3,69,590
బంగారం	2 గ్రాముల 650 మిల్లీ గ్రాములు
వెండి	19 గ్రాముల 680 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/ పూరీ



అర్హులకు న్యాయం చేయాలి

● బీజేపీ ఆధ్వర్యంలో నిరసనలు

- 10లో



ఏడుగురు నిందితులు అరెస్టు

- 10లో

న్యూస్‌రీల్

సీబీఐ విచారణకు డిమాండ్

● నవ కిషోర్ దాస్ హత్యపై పిల్ దాఖలు

భువనేశ్వర్: రాష్ట్ర ఆరోగ్య–కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి నవ కిషోర్ దాస్ హత్య ఘటన వివాదం ఒడిశా హైకోర్టుకు చేరింది. హత్యపై సీబీఐ విచారణ కోరుతూ ఇండియన్ డవలప్‌మెంట్ కౌన్సిల్ పిల్ దాఖలు చేసింది. గత నెల 29వ తేదీన మంత్రి నవ కిషోర్ దాస్ హత్యకు గురైన విషయం తెలిసిందే. హత్య జరిగి 10 రోజులు గడిచినా హత్యకు గల కారణాలు తెలియరాలేదు. తీవ్ర సంచలనం రేపిన ఈ హత్య దర్యాప్తు బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం క్రైమ్ బ్రాంచ్‌కు అప్పగించింది. హైకోర్టు విశ్రాంత జడ్జి ప్రత్యక్ష పర్యవేక్షణలో విచారణ కొనసాగుతుండగా, జస్టిస్ జె.పి. దాసు పర్యవేక్షకులుగా వ్యవహరిస్తున్నారు. విచారణకు వీలుగా హత్య చేసిన గోపాల్ అరెస్ట్ తర్వాత తొలుత 4 రోజులు, తదుపరి 4 రోజులు రిమాండ్‌కు తరలించారు. అయితే విచారణలో హత్యకు గల కారణాలు రాబట్టక పోవడంపై పిటిషనర్ సంస్థ ఆవేదన వ్యక్తం చేసింది. పారదర్శక విచారణ కోసం సీబీఐకి కేసు అప్పగించాలని కోరారు.

ఏటీఎం దగ్ధం

భువనేశ్వర్: నగరంలోని బ్రహ్మేశ్వర్ పట్న రోడ్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో సోమవారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదంలో ఏటీఎం పూర్తిగా దగ్ధమైంది. ఏటీఎంలో మంటలు చెలరేగడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. అగ్ని మాపక సిబ్బంది, స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

నేడు బొనాకొ లగ్గి

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని ముఖ అలంకార సేవ (బొనాకొ లగ్గి) బుధవారం నిర్వహించనున్నారు. ఫాల్గుణ కృష్ణ తృతీయ పురస్కరించుకొని శ్రీమందిరం రత్న వేదికపై మూల విరాటులకు ఈ సేవ నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికార వర్గాలు తెలియజేశాయి. బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కొనసాగుతుంది. ఈ వ్యవధిలో భక్తులకు శ్రీమందిరం లోనికి ప్రవేశం నివారించి, సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



సంఘటన స్థలంలో రోషన్ మృతదేహం (ఇన్‌సెట్లో) రోషన్ (ఫైల్)

రాయగడ: జిల్లా కేంద్రానికి సమీపంలోని రఫ్‌కొన కూడలిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కాసీపూర్ సమితి తొలామల్లిగాం గ్రామానికి చెందిన రోషన్ గౌడా (25) మధ్యాహ్నం తన స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై రాయగడ వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో రోషన్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. తనతో వచ్చిన స్నేహితుడికి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిల్లులో అగ్నిప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాయగడ: జిల్లాలోని రామనగుడ సమితి గులుముండ పంచాయతీ ఎదురువలస గ్రామంలో ఉన్న చందన అగ్రిటెక్ జిన్నింగ్ మిల్‌లో సోమవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదంలో రూ.కోట్లు విలువ చేసే వస్తువులు దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. సమీపంలోని గుమడ, గుణుపూర్‌ల నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి సుమారు రెండు గంటలు శ్రమించి మంటలను అదుపు చేశారు. సుమారు 3,500 క్వింటాళ్ల పత్తి ప్రమాదంలో దగ్ధమైనట్లు గుమడా అగ్నిమాపక శాఖ అధికారి జగన్నాథరావు తెలియజేశారు.

పంట ఘనం.. ఫలం మధురం

స్ట్రాబెర్రీ అంటే ఇష్టపడనివారు ఉండరు. ఎర్రని రంగుతో అత్యంత ఆకర్షవంతంగా ఉండే ఈ పండును చూస్తే ఎవరికైనా నోరూరుతుంది. ఒక్కసారి తింటే ఆ ఫల మాధుర్యం మనల్ని మరిచిపోనివ్వదు. ఒకప్పుడు విదేశాలకే పరిమితమైన ఈ పంట ప్రస్తుతం మన రాష్ట్రంలో విస్తరిస్తోంది. కొరాపుట్ జిల్లాలోని కొటియా ప్రాంతంలో పంట సాగు కొత్తపుంతలు తొక్కుతోంది. అధికారుల సాయంతో రైతులు అధిక దిగుబడి సాధిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.



కొరాపుట్ జిల్లాలో సాగు చేస్తున్న స్ట్రాబెర్రీ పంట

- కొరాపుట్ జిల్లాలో విరివిగా స్ట్రాబెర్రీ సాగు
- అధిక లాభాలు ఆర్జిస్తున్న రైతులు
- రుచికి సీఎం నవీన్ ఫిదా

భువనేశ్వర్: కొరాపుట్ జిల్లాలోని కొటియా ప్రాంతం స్ట్రాబెర్రీ సాగులో దూసుకుపోతోంది. ఇక్కడ పండించే స్ట్రాబెర్రీ రుచి అద్భుతంగా ఉందని సీఎం నవీన్ పట్నాయక్ కొనియాడడం విశేషం. వాస్తవానికి దక్షిణ, నైరుతి ఒడిశా జిల్లాల కొండ చరియ ప్రాంతాలు స్ట్రాబెర్రీ సాగుకు అనుకూల ప్రాంతాలు. సముద్ర మట్టానికి సుమారు 3,000 అడుగుల ఎత్తులో ఉన్న కొరాపుట్, నువాపడా జిల్లాల్లో స్ట్రాబెర్రీ పండించవచ్చు. దీంతో వాణిజ్యపరంగా ఇక్కడ పంటను అభివృద్ధి చేసేందుకు అధికారులు చురుకుగా సన్నాహాలు చేస్తున్నారు.

5 ఎకరాల్లో ప్రారంభం

కొరాపుట్ జిల్లాలోని ఐటీడీఏ, వ్యవసాయ శాఖ అధికారులు స్ట్రాబెర్రీ పండించడంలో రైతులకు శిక్షణ అందించి ప్రోత్సహించారు. తొలుత 5 ఎకరాల పొలంలో ఈ సాగు ప్రారంభించారు. పూణే నుంచి 55,000 స్ట్రాబెర్రీ మొక్కలు తెప్పించారు. 3 స్వయం సహాయక బృందాలు, 45 రైతు కుటుంబాలకు స్ట్రాబెర్రీ సాగు శిక్షణ కల్పించారు. 50 రోజుల స్వల్ప వ్యవధిలో సాగు ఫలితాలు కనిపించడంతో సాగుపై ఆసక్తి పెరిగింది.

ఊహాతీత ఫలితాలు

కొరాపుట్ జిల్లా పొట్టంగి మండలం కొటియాలో స్ట్రాబెర్రీ ప్రయోగాత్మక సాగు ఊహాతీత ఫలితాలు



కొటియా స్ట్రాబెర్రీ రుచి చూస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

సాధించింది. వ్యవసాయం, రైతు సాధికారత విభాగం జిల్లా యంత్రాంగం క్రియాశీల సహకారంతో 20 ఎకరాల విస్తీర్ణంలో స్ట్రాబెర్రీ సాగుకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో వ్యవసాయం, రైతు సాధికారత శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ అరబింద కుమార్ పాఢీ ఇటీవల కొటియా పర్యటన పురస్కరించుకొని స్ట్రాబెర్రీ సాగు రైతులతో సమావేశమయ్యారు. స్ట్రాబెర్రీ సాగుకు పూర్తిస్థాయిలో సహాయం అందజేయనున్నట్లు తెలియజేశారు. సాగు విస్తరణకు అంకితభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రైతులు నారు గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. స్ట్రాబెర్రీ సాగు ఒకసారి విజయవంతమైతే ఇతర పండ్ల సాగు కంటే చాలా లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు.

ప్యాకెట్ ధర రూ.100

ప్రస్తుతం ఇక్కడ స్ట్రాబెర్రీ పంట లాభసాటిగా



అమ్మకానికి సిద్ధమైన స్ట్రాబెర్రీలు

మారింది. ఒక చిన్న ప్యాకెట్ అమ్మకంతో రూ.100 వరకు లాభం వస్తోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తొలి ఏడాదే టర్నోవర్ రూ.4.60 లక్షలకు తాకడం విశేషం. గత సీజన్‌లో కొరాపుట్ జిల్లా డోలియాంబ, జానిగూడ, గాలిగదూర్, ఫతుసినేరి గ్రామాల్లో 50 ఎకరాల విస్తీర్ణంలో స్ట్రాబెర్రీ సాగుకు సంకల్పించినా 20 ఎకరాల్లో మాత్రమే సాగుకు అనుకూలించింది. ఈ విస్తీర్ణంలో 6 లక్షల మొక్కలు నాటినట్లు జిల్లా ప్రోగ్రామ్ కో–ఆర్డినేషన్ వర్గాలు తెలిపాయి.

రుచి అద్భుతం: సీఎం నవీన్ పట్నాయక్

కొరాపుట్ జిల్లా కొటియా ప్రాంతంలో పండించిన స్ట్రాబెర్రీ పండ్లను సీఎం నవీన్ పట్నాయక్ రుచి చూశారు. రుచి అద్భుతంగా ఉందని కొనియాడారు. కొటియాలో స్ట్రాబెర్రీ పండించడం అభినందనీయమని పేర్కొన్నారు. స్ట్రాబెర్రీ సాగుతో మన రైతులు తియ్యదనానికి కొత్త ఒరవడి దిద్దారని హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రైతాంగానికి వెన్ను తట్టి ప్రోత్సహించిన జిల్లా యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందించారు. రైతులకు ఇటువంటి వినూత్న మార్గాల్లో సాధికారత కల్పించిన ప్రతి ఒక్కరూ అభినందనీయులని కొనియాడారు.

చోరీ కేసులో నిందితులు అరెస్టు



నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

బరంపురం: నగరంలోని ప్రేమ నగర్ 5వ వీధిలో నివాసముంటున్న విశ్రాంత ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్ ఇంట్లో జరిగిన దొంగతనం కేసులో ఒక బాలుడితో సహా మరో దొంగను పోలీసులు అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి ప్రశాంత్ కుమార్ భూపతి తెలిపిన సమాచారం మేరకు.. ఈనెల 2వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో విశ్రాంత ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్ పాత్రో ఇంటి తాళాలు పగలుగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో జోగబందు వీధికి చెందిన రోషన్ కుటియా ఉన్నట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి 450 గ్రాముల వెండి ఆభరణాలు, 2 ద్విచక్ర వాహనాలు, రూ.150 నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఏనుగుల దాడిలో ట్రాకర్ మృతి



మృతి చెందిన టిటిమి

రాయగడ: ఏనుగులను తరిమే క్రమంలో ఆంధ్రాకు చెందిన ట్రాకర్ మృతి చెందిన ఘటన సోమవారం సాయంత్రం సరిహద్దు ప్రాంతంలో చోటుచేసుకుంది. మృతుడు శ్రీకాకుళం జిల్లాకు చెందిన సాబర్ టిటిమి(25)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. కొద్ది నెలలుగా ఒడిశా–ఆంధ్ర సరిహద్దు ప్రాంతాలైన రాయగడ, గజపతి జిల్లాల్లో సుమారు పది ఏనుగుల గుంపు సంచరిస్తోంది. ఈ క్రమంలో ఆంధ్రాకు చెందిన కొత్తూరులో పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. దీంతో ఏనుగులను తరిమే ప్రక్రియలో టిటిమి భాగమయ్యాడు. ఆ సమయంలో అతడిపై ఏనుగులు ఒక్కసారిగా దాడి చేశాయి. దాడిలో టిటిమి మృతి చెందారు. శ్రీకాకుళం జిల్లా పిసికిడి గ్రామ సమీపంలో జరిగిన ఈ ఘటన అటవీ శాఖ అధికారుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

ప్రసవ వేదన

ఎక్కడో మారుమూల ప్రాంతాల్లోనే కాకుండా పట్టణాలకు సమీపంలోని ఆదివాసీ గ్రామాల ప్రజలు సైతం రహదారి సౌకర్యాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనారోగ్య సమస్య వచ్చి ఆస్పత్రికి వెళ్లాలంటే అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. జయపురం సమితి రొండాపల్లి గ్రామ పంచాయతీ రామగడ గ్రామంలోని సొంబారు ముదిలి అనే వ్యక్తి భార్య ధనయి ముదులి(30)కి సోమవారం అర్ధరాత్రి పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో వెంటనే ఆమె భర్త అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. అయితే గ్రామం నుంచి రోడ్డు మీదకు రావాలంటే సుమారు రెండు కిలోమీటర్ల కొండలు, గుట్టలు దాటి రావాల్సి ఉంటుంది. దీంతో గ్రామంలోకి అంబులెన్స్ వచ్చేందుకు దారిలేక ఉదయం 5 గంటల వరకు ఆమె పురిటి నొప్పులతోనే బాధపడింది. అనంతరం ఉదయం ఒక డోలిలో ధనయిను అంబులెన్స్ వద్దకు మోసుకెళ్లారు. అనంతరం కుములిపుట్ ప్రాథమిక వైద్య కేంద్రంలో ఆమె పండింటి కవల బిడ్డలకు జన్మనిచ్చింది. తల్లి ఆరోగ్యంగా ఉన్నా బిడ్డలు బరువు తక్కువగా ఉండటంతో జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు వైద్యాధికారి డాక్టర్ మనోలిన నాయిక్ తెలియజేశారు.



- జయపురం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కృషి మేళాలో పాల్గొన్న నాయకులు, అధికారులు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి రణేంద్ర ప్రతాప్ స్వైన్
- కొనసాగుతున్న సదరన్ ఒడిశా కృషి మేళ

జయపురం: రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి రణేందకన ప్రతాప్ స్వైన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న సదరన్ ఒడిశా కృషి మేళలో రెండోరోజు మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. రైతులు పాత పద్ధతులకు స్వస్తి చెప్పి, యంత్రాలను వినియోగించడంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. రైతులకు వడ్డీ లేకుండా రుణాలు ఇచ్చే ఏకైక రాష్ట్రం మనదేనన్నారు. రాష్ట్ర ఎస్ఎల్ఎఫ్ఎంటీటీసీ భువనేశ్వర్ డైరెక్టర్ ముక్తి కాంత మహాపాత్ర మాట్లాడుతూ.. వ్యవసాయ రంగ అభివృద్ధికి రైతులు చేపట్టాల్సిన పద్ధతులను వివరించారు. అనంతరం రైతులకు ముఖాముఖి నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులకు ధాన్యం మిల్లులు, చోడిపిండి మిల్లులు, పంపు సెట్లను అందజేశారు. కార్యక్రమంలో న్యాయ విభాగ మంత్రి జగన్నాథ్ సరక, కొరాపుట ఎమ్మెల్యే రఘునాథ్ పడాల్, కొట్‌పాడ్ ఎమ్మెల్యే పద్మిణీ దియాన్, పొట్టంగి ఎమ్మెల్యే ప్రీతమ్ పాఢి, జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, కొరాపుట్ జిల్లా కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తర్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు తాళాలు అందజేస్తున్న దృశ్యం

ఈస్ట్ కోస్ట్ రైల్వే రికార్డు

- 310 రోజుల్లో 200 మిలియన్ టన్నుల సరుకు రవాణా

భువనేశ్వర్: సరుకుల రవాణాలో ఈస్ట్ కోస్ట్ రైల్వే సరికొత్త రికార్డు సృష్టించింది. 2022–23 ఆర్థిక సంవత్సరం 310 రోజుల్లో 200.43 మిలియన్ టన్నుల సరుకును రవాణా చేసింది. కొనసాగుతున్న ఆర్థిక సంవత్సరం ముగియడానికి 55 రోజులు ఉండగా ఈ సమయానికి లోడ్ చేసిన సరుకు రవాణా రికార్డులను అధిగమించి సరికొత్త రికార్డు నెలకొలిపింది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో 320 రోజులు, 2020–21 ఆర్థిక సంవత్సరంలో 360 రోజులు, 2019–20 ఆర్థిక సంవత్సరంలో 366 రోజుల్లో ఈస్ట్ కోస్ట్ రైల్వే 200.43 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసింది. జోన్ వ్యాప్తంగా 3 మండలాలు ఖుర్దా రోడ్, వాల్తేరు, సంబల్ పూర్ ప్రాంతాల నుంచి పుంజుకున్న సరుకు రవాణాతో ఈ రికార్డు నెలకొల్పడం సాధ్యమైందని రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ తెలిపారు. వీటిలో ఖుర్దారోడ్ మండలం వాటా అత్యధికమని పేర్కొన్నారు.

ఆదాయం వృద్ధి

సరుకు రవాణాలో ఈస్టు కోస్టు రైల్వే ఆదాయం గణనీయంగా పెరిగింది. ఈ ఏడాది ఆదాయం గతం కంటె 7.5 శాతం వృద్ధి చెందింది. గతేడాది ఈ సమయానికి సరుకు రవాణా ఆదాయం రూ.19,204 కోట్లకు పరిమితం కాగా, 2022–23 ఆర్థిక సంవత్సరం సరుకు రవాణా ఆదాయం రూ. 20,635 కోట్లుగా నమోదయ్యింది. ఈ వ్యవధిలో ఈస్టు కోస్టు రైల్వే 126.18 మిలియన్ టన్నుల బొగ్గు, 20.22 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం, 18.16 మిలియన్ టన్నుల ఇతర సరుకు, 15.74 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పాదనలు, 6.27 మిలియన్ టన్నుల ముడి సరుకుని ఉక్కు కర్మాగారాలకు తరలించింది. 5.11 మిలియన్ టన్నుల ఎరువులు, 2.37 మిలియన్ టన్నుల ఖనిజ తైలం, 2.13 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలు, 1.09 మిలియన్ టన్నుల సిమెంట్ రవాణా చేసింది. దీనిలో ఖుర్దా రోడ్ మండలం 129.93 మిలియన్ టన్నులు, వాల్తేరు మండలం 57.03 మిలియన్ టన్నులు, సంబల్ పూర్ మండలం 13.47 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేశాయి.



బొగ్గు లోడ్ చేస్తున్న దృశ్యం

80 కేజీల గంజాయి స్వాధీనం

కొరాపుట్: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని కొరాపుట్ జిల్లా పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కొరాపుట్ జిల్లా లమ్తాపుట్ సమితి మాచ్‌ఖండ్ పోలీసులకు కద్రి గ్రామ సమీపంలో గంజాయి రవాణా జరుగుతున్నట్లు సమాచారం వచ్చింది. వెంటనే పోలీసులు నదీ పరివాహక ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో పోలీసులను చూసి స్మగ్లర్లు పరారయ్యారు. వెంటనే పోలీసులు వారిని వెంబడించగా 4 బస్తాల్లో 80 కేజీల గంజాయి పట్టుబడింది. పోలీసులు గంజాయిని సీజ్ చేసి కేసు నమెదు చేశారు.



కొరాపుట్: పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

గంజాయి కేసులో సర్పంచ్ సస్పెన్షన్

కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి గుల్లురు గ్రామ సర్పంచ్ సుభాష్ పంగిపై పంచాయతీ రాజ్ శాఖ అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఇటీవల ఆంధ్ర ప్రదేశ్‌లోని అరుకు పోలీసులు గంజాయి అక్రమ రవాణా కేసులో సర్పంచ్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం సుభాష్ బెయిల్ మీద విడుదలయ్యాడు. ఈ నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకున్నారు.

గంజాయి మొక్కల ధ్వంసం

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి పద్మపూర్ సమీపంలో ఉన్న నిధిగుడి అటవీ ప్రాంతంలో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి వనాలపై పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో సుమారు 90 ఎకరాల విస్తీర్ణంలోని గంజాయి మొక్కలను తగలబెట్టినట్లు అధికారి అభిరాం బెహర తెలియజేశారు. గత కొద్ది నెలలుగా విస్తృతంగా దాడులను నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఇదిలా ఉండగా జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో సిబ్బంది నిర్వహించిన దాడుల్లో భాగంగా పది కేసులను నమోదు చేసి, ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వారి నుంచి 372 లీటర్ల నాటుసారా, 2,810 లీటర్ల ఊటను స్వాధీనం చేసుకొని, నిందితులను కోర్టుకు తరలించినట్లు తెలియజేశారు.



రాయగడ: గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

సత్తాచాటిన జయపురం బాలిక



ట్రోఫీతో చిన్నారి వైష్ణవి

జయపురం: కోల్‌కతాలో నిర్వహించిన ఇండియన్ డాన్సింగ్ స్టార్ పోటీల్లో జయపురంలోని జయనగర్‌కు చెందిన చిన్నారి వైష్ణవి బెహర(10) ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆమెకు నిర్వాహకులు రూ.లక్ష బహుమతితో పాటు షీల్డును బహూకరించి సన్మానించారు. వైష్ణవి బెహర ఇతర రాష్ట్రానికి వెళ్లి డాన్స్ చేయడం ఇదే మొదటిసారి అని ఆమె తండ్రి శంకర బెహర వెల్లడించారు. చిన్నారికి పలువురు అభినందనలు తెలియజేశారు.

విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగికి జైలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయగడ నీటిపారుదల శాఖ విశ్రాంత సూపరింటెండెంట్ ఇంజినీరు పూర్ణచంద్ర దాస్‌పై 2011లో బరంపురం విజిలెన్సు శాఖ చార్జిషీటు దాఖలు చేసింది. ఈ మేరకు బరంపురం స్పెషల్ జడ్జి, విజిలెన్సు శాఖ కోర్టు ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. ఒకవేళ జరిమానా చెల్లించకుంటే మరో నెల రోజులు అదనపు శిక్ష ఉంటుందని పేర్కొంది. అనేక ఏళ్లుగా ఎన్‌ఎంఆర్, వర్క్‌చార్జి కింద పనిచేస్తున్న ఉద్యోగులను కాదని జూనియర్ క్లర్కులు, అమీన్ పోస్టులను నేరుగా ఉద్యోగాల్లో నియమించడమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను బేఖాతారు చేసినందుకు చార్జిషీటు దాఖలైంది. విజిలెన్సు కోర్టు తుది తీర్పుతో ఆయనకు రావాల్సిన పెన్షన్ కూడా ప్రభుత్వం నిలుపుదల చేసింది. ఈ కేసును మాజీ డీఎస్పీ (విజిలెన్సు) బరంపురం డివిజన్ సంతోష్ కుమార్ మిశ్రా, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేంద్రపండా (బరంపురం) దర్యాప్తు చేసినట్లు విజిలెన్సు డైరక్టరేట్ తెలియజేసింది.

ఖైదీలకు మెట్రిక్ పరీక్ష ఏర్పాట్లు

భువనేశ్వర్: రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు(బీఎస్‌ఈ) ఆధ్వర్యంలో మెట్రిక్యులేషన్ (పదో తరగతి) వార్షిక పరీక్షలు త్వరలో ప్రారంభమవ్వనున్నాయి. ఈ ఏడాది పలుచోట్ల కారాగార శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు ఈ పరీక్షలు రాయనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 11 కారాగారాల్లో 60 మంది ఖైదీలు మెట్రిక్యులేషన్ పరీక్షలు రాయనున్నారు. జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలను మెట్రిక్యులేషన్ పరీక్షలు రాసేందుకు స్థానిక ఝర్పడా ప్రత్యేక జైలుకు తరలిస్తారని జైలర్ సంతోషిని దాస్ తెలిపారు. ఈ ఏడాది ఖుర్దా, బొలంగీర్, అంగుల్, నయాగడ్, కుజాంగ్, జగత్‌సింగ్‌పూర్, జాజ్ పూర్, పూరీ జైళ్లలో వివిధ కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు, జ్యూడీషియల్ కస్టడీలో ఉన్న ఖైదీలు పరీక్ష రాసేందుకు ఇక్కడికి వస్తారని ఆమె వివరించారు. జైలు సంస్కరణల్లో భాగంగా ఈ మేరకు చర్యలు చేపడుతున్నారు. 2022 సంవత్సరంలో 147 మంది ఖైదీలు పరీక్షకు హాజరై, 10 మంది ఉత్తీర్ణులయ్యారు. 2021లో 63 మంది ఖైదీలు పరీక్షలు రాయగా, 13 మంది ఉత్తీర్ణులయ్యారు.

బస్సును ఢీకొన్న ట్రక్కు

- ఒకరు మృతి



బస్సును ట్రక్కు ఢీకొన్న దృశ్యం

భువనేశ్వర్: మహారాష్ట్రకు చెందిన యాత్రికుల బస్సు బర్‌గడ్ సోహెలా ప్రాంతం కళాశాల సమీపంలో సోమవారం అర్ధరాత్రి ప్రమాదానికి గురయ్యింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 45 మంది ప్రయాణికులు ఉన్నారు. పూరీ జగన్నాథుని దర్శనం చేసుకుని బస్సులో తిరిగి వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. ప్రయాణికుల్లో ఒకరు మృతి చెందారు. మృతుడు మహారాష్ట్ర జల్‌గాంవ్ జిల్లాకు చెందిన అథర్ దేవ్‌గా భావిస్తున్నారు. గాయపడిన 15 మందిని బుర్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో 8 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. అర్ధరాత్రి రోడ్డు పక్కన నిలిచిన యాత్రికుల బస్సుని ట్రక్కు ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో కొంతమంది యాత్రికులు కిందకు దిగి ఉండడంతో ప్రాణహాని తగ్గినట్లు తెలుస్తోంది.

డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 64 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం రెండు నుంచి ఐదు వరకు పరీక్షలు జరగుతున్నాయి. ఈ నెల 20 వరకు పరీక్షలు జరగనున్నాయి. వర్సిటీ అఫిలియేషన్ పరిధిలో రెగ్యులర్‌గా 8112, సప్లిమెంటరీగా 8345 మంది బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఎంల నుంచి పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్షల పర్యవేక్షణకు ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేసినట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు.

అర్హులకు న్యాయం చేయాలి

- బీజేపీ ఆధ్వర్యంలో నిరసనలు



కొరాపుట్: తెంతులకుంటి సమితి కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

పర్లాకిమిడి: జిల్లాలోని కాశీనగర్ బ్లాక్‌లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం మంజూరులో అవకతవకలు జరిగాయని, అర్హులకు న్యాయం చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో మహిళలు మంగళవారం నిరసన తెలిపారు. కాశీనగర్ సమితి అభివృద్ధి అధికారి కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. ఇదివరకే జనవరి 26వ తేదీన వినతిపత్రం అందజేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం బీడీవో కపిలేశ్వర్ తండికి వినతి పత్రం అందజేశారు. ఆందోళనలో దారపు రాజేష్‌కుమార్, మాజీ డిప్యూటీ స్పీకర్ రామచంద్ర పండా, బీజేపీ జిల్లా కృషక్ మోర్చా అధ్యక్షుడు ప్రశాంత్ పాలో, పెద్దిని ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొరాపుట్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో జరుగుతున్న అక్రమాలపై నబరంగ్‌పూర్ జిల్లా తెంతులకుంటి సమితి కేంద్రంలో బీజేపీ నాయకులు ఆందోళన చేశారు. పథకం కింద పేదలకు రావాల్సిన ఇళ్లు అనర్హులకు అందుతున్నాయని ఆరోపించారు. 1,050 మందిని కారణం లేకుండా జాబితా నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే అమాల బట్ట గ్రామంలో గత 3 నెలలుగా పేదలకు బియ్యం పంపిణీ చేయడం లేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీష్ బిసోయి, గౌరీ శంకర్ మజ్జి తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



పర్లాకిమిడి: బీడీవో కార్యాలయం ఎదుట ధర్నాలో మహిళలు

హైకోర్టు బెంచ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదన లేదు

- కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు

భువనేశ్వర్: రాష్ట్రంలో హైకోర్టు శాశ్వత బెంచ్‌ల ఏర్పాటుకు సంబంధించి ఒడిశా ప్రభుత్వం ఎలాంటి ప్రతిపాదన సమర్పించలేదని కేంద్ర ప్రభుత్వం పునరుద్ఘాటించింది. మంగళవారం లోక్‌సభ శూన్య గంట సమావేశంలో ఈ అంశం చర్చకు వచ్చింది. ఒడిశా ఎంపీ సురేష్ పూజారి అడిగిన ప్రశ్నకు కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు సమాధానమిస్తూ.. రాష్ట్రంలోని పశ్చిమ, దక్షిణ ప్రాంతాల్లో హైకోర్టు శాశ్వత బెంచ్‌ల ఏర్పాటుకు ఒడిశా ప్రభుత్వం డిమాండ్ చేసిందన్నారు. అయితే ఈ మేరకు వివరణాత్మక ప్రతిపాదన ఏదీ ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్ర హైకోర్టుతో సంప్రదించి పూర్తి ప్రతిపాదనను సమర్పించాలని ఒడిశా ప్రభుత్వాన్ని కేంద్రం కోరిందని తెలిపారు. గతేడాది ఏప్రిల్‌లో దీనికి సంబంధించి ఒడిశా ప్రభుత్వానికి లేఖ రాసినా, ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని పేర్కొన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి బడ్జెట్, మౌలిక సదుపాయాలకు సంబంధించిన పూర్తి ప్రతిపాదనను రాష్ట్రం సమర్పించాల్సి ఉందన్నారు. ఈ ప్రతిపాదన ఆధారంగానే కేంద్రం చర్యలు తీసుకుంటుందన్నారు. గతేడాది డిసెంబర్‌లో కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలకా ప్రశ్నకు సమాధానంగా కేంద్ర మంత్రి ఈ అంశంపై సభలో ఇదే తరహాలో సమాధానమిచ్చారు. జస్వంత్ సింగ్ కమిషన్ సిఫార్సులు, సుప్రీంకోర్టు తీర్పు మేరకు హైకోర్టు బెంచ్‌లు ఏర్పాటవుతాయని పేర్కొన్నారు.

వరుస దొంగతనాలతో ఆందోళన



దర్యాప్తు చేస్తున్న పోలీసులు

రాయగడ: పట్టణంలో జరుగుతున్న వరుస దొంగతనాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్థానిక గాయత్రీనగర్ నాలుగో లైన్‌లో నివాసముంటున్న పి.రాంబాబు ఇంట్లో సామవారం రాత్రి చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు ఇంటి తాళాలను విరగొట్టి 5 తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండితో పాటు రూ.1.50 లక్షల నగదును దొంగలించారు. ఐఐసీ రస్మిరంజన్ ప్రధాన్ తెలియజేసిన వివరాల ప్రకారం గత మంగళవారం రాంబాబు తల్లికి అనారోగ్యం చేయడంతో చికిత్స చేయించేందుకు విశాఖపట్నం వెళ్లాడు. ఈ క్రమంలో ప్రతిరోజూ పనిమనిషి ఇంటిని శుభ్రపరిచి వస్తుండేది. ఈ నేపథ్యంలో మంగవారం ఇంటిని శుభ్రపరిచేందుకు వెళ్లి చూడగా, తాళాలు విరిగి ఉండడంతో దొంగతనం జరిగి ఉంటుందని తెలుసుకొని యజమానికి సమాచారం అందించారు. దీంతో రాంబాబు బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అరుంధతి జ్యూయలర్స్‌లో దొంగతనం

- అసిస్టెంట్ మేనేజర్ అరెస్టు



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

బరంపురం: నగరంలోని చిన్న బజార్‌లో ఉన్న అరుంధతి జ్యూయలర్స్‌లో జరిగిన దొంగతనం కేసులో అసిస్టెంట్ మేనేజర్ సింహాచల్ పాత్రోని పోలీసులు మంగళవారం అరెస్టు చేసిన ఘటన చర్చనీయాంశంగా మారింది. బరంపురం ఎస్పీ శర్వాణ్ వివేక్ తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 3వ తేదీన జ్యూయలరీ షోరూంలో దొంగతనం జరిగింది. ఘటనపై యజమాని మన్‌మోహన్ బారిక్ పెద్ద బజార్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నగరంలోని బజనగర్‌లో నివాసముంటున్న అసిస్టెంట్ మేనేజర్ సింహాచల్ పాత్రోని అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.33.38 లక్షలు విలువ చేసే ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.



పోలీసులు అరెస్టు చేసిన సింహాచల్ పాత్రో

కళాకారులకు మలేషియాలో సత్కారం



సంతానంద్ ఆడిటోరియంలో ఒడిస్సీ కళాకారులు



ఒడిస్సీ నృత్య ప్రదర్శన చేస్తున్న దృశ్యం



ఒడిస్సీ నృత్య కళాకారిణికి మోమెంటో అందజేస్తున్న రమ్య హారియన్న

పర్లాకిమిడి: మలేషియా రాజధాని కౌలాలంపూర్ సంతానంద్ ఆడిటోరియంలో ఈనెల 4, 5 తేదీల్లో జరిగిన గ్లోబల్ ఫెస్టివల్, భారత్ సంస్కృతీ యాత్రలో స్థానిక శ్రీజగన్నాథ ఒడిస్సీ కళా కేంద్రానికి చెందిన 14 మంది కళాకారులు పాల్గొని నృత్య ప్రదర్శన ఇచ్చారు. కళాకారులకు ఒడిస్సీ నృత్య కళాకారుడు గురు డాక్టర్ గజేంద్ర పండా (పూరీ), ఆయన శిష్యురాలు కుమారి డి.ప్రియాంక (పర్లాకిమిడి) నేతృత్వం వహించారు. కార్యక్రమానికి భారత్ హై కమిషనర్ మలేషియా డాక్టర్ బీఎన్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయగా, భారత సామాజిక వ్యవహారాలు, కార్మికశాఖ కౌన్సిలర్ అమ్రితా దాస్, కౌలాలంపూర్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ సాంస్కృతిక కేంద్రం డైరెక్టర్ రమ్య హారియన్నలు విచ్చేసి కళాకారులను సత్కరించారు. విదేశీ గడ్డపై పర్లాకిమిడి కళాకారులు నైపుణ్యం ప్రదర్శించి సత్కారం పొందడంపై కలెక్టర్ లింగరాజ పండా, ఏడీఎం సంగ్రాం శేఖర పండా, పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు, ఒడిశా సాహిత్య అకాడమీ సభ్యులు బిచిత్రానంద బెబర్తా, క్రియేటివ్ ఆర్ట్స్ ఉపాధ్యక్షుడు ఆదర్శ దాస్, బాలికృష్ణ పాణిగ్రాహి తదితరులు అభినందనలు తెలిపారు.

ఏడుగురు నిందితులు అరెస్టు



అరెస్టు చేసిన నిందితులను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: గంజాం జిల్లా రోంగాయిలొండా బ్లాక్‌లో కోనిసి సంతకి దగ్గరలో నివాసముంటున్న సుజాత పాత్రో ఇంటిపై దాడి చేసిన ఘటనలో 7గురు నిందితులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు.

ఐఐసీ అధికారి చిత్రరంజన్ బెహరా తెలిపిన సమాచారం మేరకు.. నెల 4వ తేదీన సుజాత పాత్రో ఇంటిపై దుండగులు బాంబులతో దాడిచేసి, సుజాత ఇద్దరు కుమారులైనా సుమన్ పాత్రో, కొకియా పాత్రోలపై మారణాయుధాలతో దాడిచేసి పరారయ్యారు. ఘటనపై బాధితురాలు గోళంతరా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేసిన పోలీసులు 7గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారివద్ద నుంచి ఒక తుపాకీ, 3 కత్తులు, ఒక ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ధాన్యలక్ష్మి నమస్తుభ్యం..



ఎండకు ఎండి, వానకు తడిచి, పైరును పసిపాపలా చూసుకుని, ప్రకృతి వైపరీత్యాలకు ఎదురొడ్డి ఆరుగాలం కష్టపడితే.. ధాన్యలక్ష్మి కటాక్షం కర్షకుడికి లభిస్తుంది. ఈ శ్రమకు, ప్రతిఫలానికి కృతజ్ఞతగా రైతులు కళ్లంలో ధాన్యపు రాశులకు పూజలు చేస్తారు. ఆకుల్లో బెల్లం జావ, పప్పు ప్రసాదం, అట్లు, నెయ్యిముద్దలు, పత్రిపూలు, పసుపు కుంకమలు ఉంచి కృతజ్ఞత చెప్పే అపురూప సంప్రదాయం సిక్కోలులో కనిపిస్తుంది. పలాస మండలం బొడ్డపాడులో ఈ చిత్రం చిక్కింది. – కాశీబుగ్గ

జిల్లా జైలు సందర్శన



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు

గార: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు మంగళవారం అంపోలులోని జిల్లా కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ముద్దాయిలకు అందుతున్న భోజన, ఇతర వసతి సదుపాయాలను స్వయంగా తనిఖీ చేసి పరిశీలించారు. మహిళలను ప్రత్యేకంగా ఉంచిన సెల్‌లో మహిళా ఖైదీలందరితోనూ మాట్లాడి వారి కేసు వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సివిల్ జడ్జి మాట్లాడుతూ న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్థోమత లేనివారు ఉంటే న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలని, న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా కేసు నడిపించేందుకు న్యాయవాదిని నియమిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జైలర్ దివాకర్‌నాయుడు, న్యాయవాది ఇందిరాప్రసాద్, ఇతర జైలు సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు. అనంతరం స్థానిక రిమ్స్ వద్ద ఉన్న వన్‌స్టాప్ సెంటర్‌ను సివిల్ జడ్జి సందర్శించి సెంటర్ పనితీరును అడిగి తెలుసుకున్నారు.

11న నవోదయ 9వ తరగతి ప్రవేశ పరీక్ష

సరుబుజ్జిలి: వెన్నెవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో ప్రవేశం కోసం ఈ నెల 11న జవహర్ నవోదయ, వెంకటసాయి విద్యాసంస్థల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. హాల్ టికెట్ నంబర్ 106899 నుంచి 107282 వరకు వెన్నెలవలస వద్ద గల జవహర్ నవోదయ విద్యాలయంలో, హాల్‌టికెట్ నంబర్ 107283 నుంచి 107584 వరకు సరుబుజ్జిలి వెంకటసాయి హైస్కూల్‌లో పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

కళ్లముందే కూలిపోతుంటే..



'మేముంటున్న ప్రాంతానికి కొద్దిదూరంలోనే భూకంపం సంభవించింది. జీవితంలో ఇంత వరకు ఇలాంటి విపత్తు చూడలేదు. కాళ్ల కింద నేల కంపించి, కళ్లముందే పేకమేడల్లా భారీ భవంతులు పేకమేడల్లా కూలిపోతుంటే దిక్కుతోచని పరిస్థితి. తీవ్ర భయాందోళనకు గురయ్యాం. అయితే కంపెనీ కేటాయించిన వసతి భవనాల వరకు భూ కంప ప్రభావం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నాం.'

–ఇదీ టర్కీ భూకంపం నుంచి బయటపడిన సిక్కోలు వాసుల మాట



సురక్షితంగా ఉన్న సిక్కోలు యువకులు

వజ్రపుకొత్తూరు రూరల్: టర్కీ, సిరియా సరిహద్దులో సోమవారం సోమవారం తెల్లవారుజామున సంభవించిన ఘోర భూకంప ఘటనలో వేలాది మంది మృత్యువాత పడ్డారు. అదే ప్రాంతంలో గల జి.మౌంట్ కంపెనీలో పని చేస్తున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన సుమారు 180 మంది వలస యువకులు సురక్షితంగా బయటపడ్డారు. టర్కీ నుంచి బాధితులు మంగళవారం 'సాక్షి' ప్రతినిధితో ఫోన్‌లో తమ క్షేమ సమాచారం తెలిపారు. ఉద్దాన ప్రాంతం బాతుపురం గ్రామానికి చెందిన బత్తిని శ్రీను, బొడ్డపాడుకు చెందిన తామాడ శ్యామ్, పీఎం పురానికి చెందిన పుచ్చ బాలతో పాటు పలాస, కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం, సంతబొమ్మాళి మండలాలకు చెందిన యువకులు శేఖర్, లక్ష్మీనారాయణ, ప్రసాద్, ఉత్తమ్, వెంకటరమణ, జగదీష్‌తో పాటు మరి కొంత మంది ఉన్నారు. అలాగే ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా ప్రాంతానికి చెందిన మరో 150 మంది వలసజీవులు కూడా ఉన్నారు. తాము ఉన్న ప్రాంతానికి కొద్ది దూరంలో భూకంపం సంభవించిందని, తాము సురక్షితంగానే ఉన్నామని చెప్పారు. తాము ఉన్న కంపెనీ గదుల వరకు భూ కంపం ప్రభావం చూపకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డామని అన్నారు. తమను ప్రస్తుతం నగర శివార్లలోని సురక్షిత ప్రాంతాలకు తరలించారని చెప్పారు.

'మా బాబు క్షేమంగానే ఉన్నాడు'



కుమారుడు గురుదేవ్‌తో మాట్లాడిన తల్లిదండ్రులు పాపయ్యరెడ్డి, పద్మావతి దంపతులు

కవిటి: టర్కీలో సంభవించిన భూకంపంలో తమ బిడ్డకు ఎలాంటి ఇబ్బందులు కలగలేదని కవిటికి చెందిన బి.పాపయ్యరెడ్డి విలేకరులకు తెలిపారు. ఇటీవల టర్కీలో సంభవించిన పెను విపత్తులో పలువురు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో తమ బిడ్డ క్షేమం కోసం బి.పాపయ్యరెడ్డి పద్మావతి దంపతులు ఆందోళన చెందారు. అయితే ప్రమాద స్థలానికి తాను 300 కిలోమీటర్ల దూరంలో ఉన్నానని అతను ఫోన్ చేయడంతో వీరు ఊపిరి పీల్చుకున్నారు. తమ ప్రాంతానికి కూడా ముప్పు ఉందని హెచ్చరికలు వచ్చాయని తమ బిడ్డ చెప్పాడని వారు తెలిపారు.

క్లుప్తంగా

సంగమేశ్వరస్వామి ఆలయ ప్రసాదాల వేలం

వంగర: రానున్న మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండల పరిధిలోని పవిత్ర సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం ప్రసాదాల వేలం పాట జరిగింది. ఆలయ చైర్మన్ బోను ఆనందరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బోను అప్పలనాయుడు అనే వ్యక్తి రూ.73వేలకు వేలం పాటను దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పొన్నాడ శ్యామలరావు, మాధవరావు, సిద్ధాంతం గణపతి, ఉగిరిముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

త్రో బాల్ రాష్ట్ర జట్టులో నెల్లిమర్ల విద్యార్థి



దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

నెల్లిమర్ల: త్రో బాల్ రాష్ట్ర జట్టుకు నెల్లిమర్ల పట్టణానికి చెందిన విద్యార్థి ఎస్.దుర్గాప్రసాద్ ఎంపికయ్యాడు. ఈ నెల 4వ తేదీన విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి త్రో బాల్ ఎంపిక పోటీల్లో పాల్గొన్న దుర్గాప్రసాద్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. 18, 19 తేదీల్లో కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులంలో జరిగే సౌత్ జోన్ త్రోబాల్ సీనియర్స్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాడు. దుర్గాప్రసాద్ పట్టణంలోని చక్ర జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ పతివాడ శంకర్రావు, అధ్యాపకులు అభినందించారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

- కలెక్టర్ సూర్యకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: ప్రతి పదేళ్లకు తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ తమ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి కోరారు. ఆధార్‌లో నమోదు చేసిన వివరాల్లో ఎటువంటి మార్పులు ఉన్నప్పటికీ పదేళ్లకోసారి అప్‌డేట్ చేసుకోవడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. దీనికోసం నెలరోజుల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ తొలి సమావేశం మంగళవారం జరిగింది.సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి ఏడేళ్ల మధ్య పిల్లలకు ఉచితంగా అప్‌డేట్ చేస్తారన్నారు. ఏడేళ్లు దాటిన వారికి ఆధార్ అప్‌డేట్ చేయకపోతే రూ.100 జరిమానాతో అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆధార్ అప్‌డేట్ కోసం జిల్లా వ్యాప్తంగా 125 సచివాలయాలను ఎంపిక చేశామని తెలిపారు. ప్రస్తుతం ఎంపిక చేసిన ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల్లో మూడు రోజులపాటు ఆధార్ అప్‌డేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని విద్యార్థులంతా వినియోగించుకోవాలని సూచించారు. ఐదేళ్లలోపు పిల్లల వివరాలను తప్పనిసరిగా సచివాలయాల్లో నమోదు చేయించుకోవాలని చెప్పారు. జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, సీపీఓ పి.బాలాజీ, సచివాలయాల సమన్వయ కర్త అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

9న అండర్ 17 బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

శృంగవరపుకోట: జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-17బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు ఈనెల9వ తేదీ గురువారం ఉదయం 9గంటలకు తెన్నుబొడ్డవరలోని డాక్టర్ వరలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్‌లో నిర్వహిస్తున్నట్టు ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.శ్రీరాములు తెలిపారు. జిల్లాస్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్వీ రమణ ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే క్రీడాకారులకు వరలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల యాజమాన్యం భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు ఫోన్‌నంబర్ 7989199534ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

రైతులకు ఉపయోగపడేలా మీటర్లు

రాజాం సిటీ: రైతుల శ్రేయస్సుకే వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు ట్రాన్స్‌కో సీఎండీ కె.సంతోష్‌రావు తెలిపారు. రాజాంలో మీడియాతో ఆయన మంగళవారం మాట్లాడారు. పైలెట్ ప్రాజెక్టుగా శ్రీకాకుళంలో అమలు చేశామని, సత్ఫలితాలు వచ్చాయన్నారు. 30 శాతం విద్యుత్ ఆదా కనిపించిందని తెలిపారు. మీటర్ల ద్వారా ఎంత మొత్తంలో విద్యుత్ వాడుతున్నది రైతులకు తెలుస్తుందని, రాయితీలు వర్తిస్తాయని చెప్పారు. వ్యవసాయానికి వాడుతున్న విద్యుత్‌కు ఒక్కరూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. జేఎల్ఎం గ్రేడ్-2 నియామకాలు చేపట్టామని, గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ సేవలు అందిస్తామని తెలిపారు. మెటీరియల్ కొరత లేదని, ఎటువంటి సమస్యలు తలెత్తినా టోల్‌ఫ్రీ నంబర్ 1912కు తెలియజేయాలన్నారు. ఆయన వెంట ప్రాజెక్టు డైరెక్టర్ ఏవీవీ సూర్యప్రతాప్, ఎస్ఈ ఎల్.డి.ప్రసాద్ ఉన్నారు.

వికటించిన ఆహారం

- 14 మంది హాస్టల్ విద్యార్థినులకు అస్వస్థత
- స్థానిక పీహెచ్‌సీలో చికిత్స



అస్వస్థతకు గురైన విద్యార్థినులను పరామర్శిస్తున్న ఎంపీడీఓ తదితరులు



108 వాహనంలో విద్యార్థినికి సేవలు అందిస్తున్న సిబ్బంది



మెరుగైన వైద్యం కోసం ఎస్.కోట సీహెచ్‌సీకి విద్యార్థినిని తరలిస్తున్న 108 సిబ్బంది



వసతి గృహం అధికారిణి జి.శ్రీదేవిని విచారణ చేస్తున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తదితరులు

కొత్తవలస: మండల కేంద్రంలో గల వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహానికి 14 మంది విద్యార్థినులు మంగళవారం అస్వస్థతకు గురయారు. ఈ సంఘటనపై స్థానికులు, విద్యార్థినులు, వైద్యాధికారిణి ఎం.శ్రుతి అందించిన వివరాలిలా ఉన్నాయి. వసతి గృహంలో ప్రస్తుతం 55 మంది విద్యార్థినులు ఉంటున్నారు. సోమవారం రాత్రి వంకాయ, కందిపప్పు కూరతో విద్యార్థినులకు హాస్టల్ సిబ్బంది అన్నం పెట్టారు. మంగళవారం ఉదయం పులిహోర, శనగపప్పు చెక్కి తిన్న తరువాత విద్యార్థినులు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు పయనమయ్యారు. కొంత దూరం వచ్చేసరికి కొంతమంది విద్యార్థినులు కళ్లు తిరిగి పడిపోవడం, వాంతులు చేసుకోవడాన్ని స్థానికులు గమనించి పీహెచ్‌సీకి తరలించారు. వారిలో 14 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. దీంతో వైద్యాధికారిణి ఎం.శ్రుతి తమ సిబ్బందితో విద్యార్థినులకు చికిత్స చేశారు. నలుగురు విద్యార్థినులు తేరుకోవడంతో హాస్టల్‌కు పంపించేశారు. మిగిలిన వారిలో ఏడుగురిని మెరుగైన వైద్యం కోసం విశాఖ జిల్లా పెందుర్తి ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. అలాగే మరో ముగ్గురు విద్యార్థినులను ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. ఎవరికి ప్రాణహాని లేదని వైద్యులు తెలిపారు. ఈ పరిస్థితిపై తమసీల్దార్ ప్రసాద్‌రావు, ఆర్ఐ ఎస్.కిశోర్, ఎంఈఓ జి.శ్రీదేవి, ఎంపీపీ ఎన్.గోపెమ్మ, పీఏసీఎస్ చైర్మన్ జి.శివ తదితరులు పీహెచ్‌సీకి వచ్చి సమీక్షించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారిణి ఎస్వీ రమణకుమారి, విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వరరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి యశోధనరావులు ఆస్పత్రికి వచ్చి విద్యార్థినులను పరామర్శించి, హాస్టల్ ప్రాంగణంలో పరిశీలించారు. అనంతరం వార్డెన్ జి.శ్రీదేవిని విచారణ చేశారు.

విద్యార్థినుల అస్వస్థతపై 24 గంటల్లో నివేదిక

వసతి గృహ విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటనపై ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసల అప్పారావు,జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ జి.హిమబిందు, సభ్యురాళ్లు సుధారాణి పట్నాయక్, భవానిలు వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ జరిగిన ఘటనపై సంబంధిత బీసీ సంక్షేమ అధికారులు కమిషన్‌కు 24 గంటల్లో తుది నివేదికను సమర్పించాలని ఆదేశించారు. వసతి గృహంలో గల మరుగుదొడ్లు, వంటగది తదితర పరిసరాల పరిశుభ్రతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వసతిగృహం సిబ్బంది బాధ్యతా రాహిత్యంగా ఉంటే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థినులకు తరచూ వైద్యపరీక్షలు నిర్వహించాలని మౌలిక సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి యశోధనరావు, ఏఈఓ జి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం..!

సాక్షి ఎఫెక్ట్

- ఒంటరైన కామేష్‌కు అధికారులు, పెద్దలు



కామేష్‌తో మాట్లాడుతున్న అధికారులు, స్థానిక పెద్దలు

చీపురుపల్లి: తల్లిదండ్రులు లేరని కుంగిపోయి అధైర్య పడొద్దని చక్కగా చదువుకుని లక్ష్యాలు చేరుకునే వరకు ధైర్యంగా ఉండాలని అందుకోసం అండగా ఉంటామని ఒంటరైన కామేష్‌కు ప్రభుత్వ యంత్రాంగం, స్థానిక పెద్దలు ధైర్యం చెప్పారు. 16 రోజుల వ్యవధిలో తల్లిదండ్రులు మృతి చెండంతో ఒంటరిగా మిగిలిన వారి కొడుకు కామేష్ కోసం ఈ నెల 6న సాక్షి పత్రికలో 'ఒంటరినైపోయాను' శీర్షికన కథనం వెలువడింది. దీనికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు స్పందించారు. దీంతో ఆయన సూచనల మేరకు సమగ్ర శిశు సంక్షేమశాఖ, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్, మండల విద్యాశాఖ, సచివాలయ ఉద్యోగులు, స్థానిక పెద్దలు మంగళవారం పట్టణంలోని విజయకాలనీకి వచ్చి నీలాతి కామేష్‌ను కలిసి పరామర్శించారు. ఆ యువకుడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కుంగిపోవద్దంటూ ధైర్యం చెప్పారు. ఇప్పటికే డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కామేష్ చదువు చివరి వరకు పూర్తి చేయాలని అందుకు అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామని స్థానిక పెద్దలు హామీ ఇచ్చారు. తల్లిదండ్రులు లేరనే బాధను దిగమింగుకుని కష్టపడి చదువుకుని చక్కని భవిష్యత్ పొందినప్పుడే తల్లిదండ్రులు సంతోషిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీఓ కేవీఎన్.రాజేశ్వరి, ఎంఈఓ ఎస్.భానుప్రకాష్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎమ్.విజయలక్ష్మి, ఉపాధ్యాయుడు ఎం.అప్పలరాజు, అంగన్వాడీ వర్కర్ భారతి, సీఆర్‌పీ రామకృష్ణ, వలంటీర్ భాగ్యలక్ష్మి, స్థానిక పెద్దలు గవిడి లక్షుంనాయుడు, మల్లెంపూడి శ్రీను, పీతల మురళి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో ఎన్‌హెచ్‌ఎం పోస్టుల మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: వైద్యారోగ్య శాఖ పరిధిలోని ఖాళీల భర్తీకి సంబంధించి ఇటీవల ఇచ్చిన నోటిఫికేషన్‌లో సెక్యూరిటీ గార్డు, పిడియాట్రిక్ సోషల్ వర్కర్, ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ పోస్టుల ప్రొవిజనల్ మెరిట్ జాబితా విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్వీ రమణకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 9 వతేదీ సాయంత్రం 5 గంటల లోపు సంబంధిత డాక్యుమెంట్స్‌పై గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి అందజేయాలని సూచించారు.

జిల్లా కోర్టు కాంప్లెక్స్ తరలింపు

- హైకోర్టు గ్రీన్ సిగ్నల్



దుప్పాడలో భవన సముదాయాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ చక్రవర్తి

విజయనగరం లీగల్: జిల్లా కోర్టు కాంప్లెక్స్‌ను తాత్కాలిక భవనంలోకి తరలించేందుకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుత భవనం శిథిలావస్థలో ఉండడంతో నూతన భవన సముదాయాన్ని నిర్మించేందుకు హైకోర్టు సుముఖత వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దుప్పాడలో ఉన్న గ్రేస్ పబ్లిక్ స్కూల్ సముదాయంలోకి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కోర్టు కార్యకలాపాల నిర్వహణకు అనుగుణంగా కొంతమార్పులు, చేర్పులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ చక్రవర్తి సూచించారు. ఈ ప్రక్రియ ఏప్రిల్‌కు పూర్తయ్యేలా పనులు చేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు జిల్లా న్యాయమూర్తి సాయికల్యాణచక్రవర్తితో పాటు న్యాయవాదుల సంఘప్రతినిధులు బి.సంజీవరావు,వై.హరికృష్ణ, రాష్ట్ర బార్ కౌన్సిల్ మాజీ వైస్ చైర్మన్ కేవీఎన్ తమ్మన్నశెట్టితో పాటు న్యాయమూర్తులు, న్యాయవాదులు మంగళవారం దుప్పాడ చేరుకుని ఆ భవనాన్ని నిశితంగా పరిశీలించారు. ప్రస్తుతం వీటీ అగ్రహారంలో ఉన్న కోర్టు కాంప్లెక్స్ స్థానంలో జీప్లస్ సిక్స్ నూతన భవనాన్ని నిర్మించేందుకు మార్గం సుగమమైంది. సుమారు రూ. 113 కోట్ల వ్యయంతో నూతన భవనాన్ని రెండు, మూడేళ్లల్లో పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఈ నిర్మాణం చేపట్టనున్నారు.

పటువర్ధనంలో ప్రజాభిప్రాయసేకరణ

- ఆర్డీవో ఆధ్వర్యంలో అధికారుల పర్యటన



ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్న ఆర్డీవో ఎం.అప్పారావు, వివిధ శాఖల అధికారులు

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో భూములు, ఇళ్లు కోల్పోయి నిర్వాసితులైన వంగర మండలం పటువర్ధనం నిర్వాసిత గ్రామంలో చీపురుపల్లి ఆర్డీవో ఎం.అప్పారావుతోపాటు అధికారుల కమిటీ మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. ఇక్కడ ప్రజలకు శాశ్వత పునరావాసం కల్పించాలి లేదా పాత గ్రామంలోనే గృహాలు నిర్మించి వాటికి శాశ్వత హక్కులు సమకూర్చడంతోపాటు గ్రామాన్ని అభివృద్ధి చేయాలని మడ్డువలస నిర్వాసిత పోరాట కమిటీ గౌరవ అధ్యక్షుడు నల్ల కాశినాయుడు, నల్ల పరశురాంనాయుడుతోపాటు పలువురు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు పునరావాసంపై చీపురుపల్లి ఆర్డీవో ఆధ్వర్యంలో అధికారుల కమిటీ గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆర్డీవో ఎం.అప్పారావు ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు గ్రామంలో పర్యటించి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు.

పాత గ్రామంలోనే ఇళ్లు నిర్మించాలి

ఈ సందర్భంగా ఎంపీటీసీ తెంటు కుమారి, జోగినాయుడు మాట్లాడుతూ పాత గ్రామంలోనే ఇళ్లు నిర్మించి పూర్తి హక్కులు కల్పించి గ్రామాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించాలని వెల్లడించారు. నల్ల పరశురాంనాయుడు, మడ్డువలస నిర్వాసిత పోరాట కమిటీ గౌరవ అధ్యక్షుడు నల్ల కాశినాయుడులు మాట్లాడుతూ హైకోర్టు సూచనల మేరకు పటువర్ధనం-బాగెంపేట గ్రామాల మధ్య భూమి కొనుగోలు చేసి పునరావాస కాలనీ ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో పాత గ్రామంలోనే కొత్త ఇళ్లు నిర్మించి శాశ్వత హక్కు కల్పించాలని, తాగునీరు, డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మాణం, మౌలిక వసతులతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులకు తెలియజేశారు. పంచాయతీ నిధులు గ్రామ అభివృద్ధికి వినియోగించేలా ఉత్తర్వులు అందించాలని సర్పంచ్ నల్ల సూర్యం వినతిపత్రం అందించారు. అనంతరం ఆర్డీవో అప్పారావు మాట్లాడుతూ సమగ్ర ప్రజాభిప్రాయసేకరణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ఐజాక్, ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు, ఎంఈవో వై.దుర్గారావు, ఏఈలు సూర్యనారాయణ, ఆనందరావు, ప్రాజెక్టు డీఈ నర్మదాపట్నాయక్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాబార్డ్ ప్రాజెక్టులపై కలెక్టర్ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి, హాజరైన జిల్లా అధికారులు

విజయనగరం అర్బన్: నాబార్డ్ ఆధ్వర్యంలో జిల్లాలో రూ.1132 కోట్లతో గ్రామీణ రహదారులు, పాఠశాలల అభివృద్ధి, ఆస్పత్రుల సోషల్ ఇన్‌ఫ్రాకు సంబంధించి 428 ప్రాజెక్టులు చేపట్టినట్లు కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. ఈ పనుల వేగాన్ని పెంచి ప్రాజెక్టలన్నీ త్వరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నాబార్డ్ డీడీ నాగార్జునతో కలిసి 19 శాఖల అధికారులతో ప్రాజెక్ట్ వారీగా జరిగిన పనులు, ఖర్చయిన నిధులు, పెండింగ్‌లో ఉన్న పనులపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో 19 శాఖలకు సంబంధించిన 428 ప్రాజెక్ట్‌లు మంజూరు చేయగా ఇంతవరకు 35 పూర్తయ్యాయని, 19 ప్రాజెక్ట్‌లు పూర్తయిన నివేధికలు అందించాల్సి ఉందని తెలిపారు. పూర్తయిన ప్రాజెక్టుల వివరాలను వెంటనే అందించి మిగిలిన నిధులను కూడా పొందాలని సూచించారు. ఇంకా 10 ప్రాజెక్ట్‌లను ప్రారంభించాలని నెమ్మదిగా జరుగుతున్న 58 ప్రాజెక్టులు వేగంగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. నిధుల కొరత లేనందున పనులన్నీ గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

డాక్యుమెంటేషన్ చేయాలి

పూర్తయిన ప్రాజెక్టలకు సంబంధించి ప్రాజెక్ట్ ఎన్ని రోజులు పట్టింది, ఎంత ఖర్చు అయ్యింది, ప్రాజెక్ట్ ఉద్దేశం ఏమిటి, ఎంత మందికి, ఎలా ఉపయోగపడుతోందన్న వివరాలతో కూడిన డాక్యుమెంటేషన్ రూపొందించాలని స్పష్టం చేశారు. ప్రాజెక్ట్ ఫోటోలను కూడా అప్‌లోడ్ చేయాలని, అదే విధంగా యూసీలు వెంటనే పంపించాలని, ఈ కార్యక్రమాలను ముఖ్యప్రణాళికాధికారి పర్యవేక్షించాలని సూచించారు. నాబార్డ్ డీడీ నాగార్జున మాట్లాడుతూ మూడేళ్లలో శతశాతం ఆర్ఐడీఎఫ్ బట్వాడా జరగాలని తెలిపారు. ఆలస్యమైతే ప్రాజెక్ట్ వ్యయం పెరిగే అవకాశం ఉందని, పూర్తి బిల్లులను సబ్‌మిట్ చేస్తే చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. ఆయా శాఖల ఉన్నతాధికారి ద్వారా బిల్లులను, యూసీలను సమర్పించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధికారులు, విద్యాశాఖ, వైద్యశాఖలకు చెందిన ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

జూన్ నాటికి టవర్లు సిద్ధం చేయాలి



మొబైల్ టవర్ల ప్రతినిధులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలో మొబైల్ టవర్లను రానున్న జూన్ నాటికి సిద్ధం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆపరేటర్లను ఆదేశించారు. టవర్ల నిర్మాణాల ప్రగతిపై కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం అధికారులు, మొబైల్ ఆపరేటర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాను అభ్యుదయ జిల్లాగా కేంద్రప్రభుత్వం గుర్తించదన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థ మెరుగుపడడం వల్ల జిల్లా అభివృద్ధికి నాంది పడుతుందన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చి, జిల్లా రూపురేఖలు మారి, మారుమూల గ్రామాల్లో టెలి మెడిసిన్‌వంటి వ్యవస్థల ఏర్పాటుకు దోహదం చేస్తుందని, గ్రామ సచివాలం వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు అవకాశం కలుగుందన్నారు. దీని దృష్ట్యా జూన్ నాటికి టవర్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాకు కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ 182 మొబైల్ టవర్లు మంజూరు చేసిందన్నారు. టవర్ల నిర్మాణంలో అవసరమైన సహాయసహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. మారుమూల ప్రాంతాలలో అవసరమైతే గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం అధికారుల సహాయ సహకారాలు తీసుకుని పనులు వేగవతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ ఒ.ఆనంద్, ఐటీడీఏ పీఓలు బి.నవ్య, సి.విష్ణుచరణ్, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, డీఆర్‌ఓ జె.వెంకటరావు, ఆర్‌డీఓ కె.హేమమలత, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్, జియో ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తజన జాతర..!

- పోలమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- సుమారు లక్షన్నర మంది దర్శనం
- ఉదయం నుంచి కిక్కిరిసిన క్యూలైన్లు
- అమ్మవారికి మొక్కుబడుల చెల్లింపు





అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు, (ఇన్‌సెట్లో) పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి మూడో జాతర భక్తజన జాతరగా మారింది. అమ్మవారి దర్శనానికి మంగళవారం వేకువజాము నుంచి భక్తులు పోటెత్తారు. చదురుగుడి, వనంగుడి వద్ద ఉన్న క్యూలైన్లు కిక్కిరిశాయి. శంబర గ్రామం భక్తజన సంద్రంగా మారింది. దారులన్నీ భక్తుల సందడితో కనిపించాయి. అమ్మవారిని సుమారు లక్షాయాభైవేల మంది భక్తులు దర్శించుకున్నట్టు ఆలయ అధికారులు చెబుతున్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

గోముఖి నదిలో భక్తులు పుణ్యస్నానాలాచరించి పోలమాంబకు ప్రత్యేక పూజలు చేశారు. రూ.10, రూ.50 క్యూలైన్లలో వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కుబడులు చెల్లించారు. తలనీలాలు సమర్పించారు. ఉదయం 10.15 గంటల తరువాత ఒక్కసారిగా భక్తులు శంబర గ్రామానికి చేరుకోవడంతో రద్దీ పెరిగింది. ప్రధానాలయం వద్ద క్యూకాంప్లెక్స్‌లు చాలక గోముఖి నదిపై ఉన్న బ్రిడ్జ్ వరకు ఎండలోనే నిరీక్షించారు. సాలూరు సీఐ ధనుంజయరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ ఏర్పాట్లు చేశారు. భక్తులకు శంబర గ్రామానికి చెందిన సత్యసాయిసేవా సమితి తాగునీటిని సరఫరా చేసింది.



సిరిమాను బండి, కర్రకు పూజలు

శంబర గ్రామంలోని ప్రధాన రహదారి వద్దనున్న సిరిమాను కర్రకు, బండికి భక్తులు పసుపు, కుంకమలతో పూజలు చేశారు. భక్తుల రద్దీతో కొందరు ఆలయంలోకి వెళ్లలేక చదురుగుడి ముందున అమ్మవారికి మొక్కుబడులు చెల్లించారు. ఈ సారి చెముడు రహదారివైపు కాకుండా, కవిరిపల్లి గ్రామం మీదుగా ఆటోలను విడిచిపెట్టడం, శంబర జెడ్పీహెచ్ఎస్ సమీపంలో పార్కింగ్ స్థలం నిండిపోవడంతో రహదారికి ఇరువైపులా ఆటోలు నిలుపదలచేశారు. కాసేపు ట్రాఫిక్ సమస్య తలెత్తింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. జాతరలో ఇద్దరు దివ్యాంగులు ఆలపించిన సినీగీతాలు, భక్తిగీతాలు భక్తులను మంత్రముగ్దులను చేశాయి.



తలనీలాలు సమర్పించుకుంటున్న చిన్నారి



భక్తులతో నిండిన చదురుగుడి క్యూకాంప్లెక్సు



తోటల్లో సహపంక్తి భోజనాలు



వేపచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు